క్లుప్తంగా

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాంకు సన్మానం



నర్సంపేట: తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ముస్లిం నాయకులు సన్మానించారు. ప్రొఫెసర్ కోదండరాం నర్సంపేటకు వచ్చిన సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ నివాసంలో ముస్లిం నాయకులు మహ్మద్ ఖలీద్, సయ్యద్ షేక్ జావిద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మహ్మద్ ఖలీద్, సయ్యద్ షేక్ జావిద్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోదండరాం సేవలను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాంకు ప్రభుత్వంలో కీలక బాధ్యతలు అప్పగించి ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహ్మద్ సందాని, హఫీజ్, నోమాన్, సత్తార్, మునీర్, హర్షత్, ఇర్ఫాన్, మౌలిసా తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు తీర్మానం



వర్ధన్నపేట: మండలంలోని కట్ర్యాల గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను గ్రామ పంచాయతీ పాలకవర్గమే నిర్వహించాలని తీర్మానం చేశారు. జాతర నిర్వహణ కోసం సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన గ్రామ సభలో గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం సర్పంచ్ సంపత్‌రెడ్డి మాట్లాడారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు పంచాయతీ పాలక వర్గం జాతర నిర్వహణ చేపట్టాలని తీర్మానం చేసినట్టు ప్రకటించారు. సభలో ఉపసర్పంచ్ కట్ల మహేశ్, వార్డు సభ్యులు, ఆలయ పాత కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఈజీఎస్' సామాజిక తనిఖీకి ఏర్పాట్లు

దుగ్గొండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు రూ.6.58 కోట్ల విలువైన పనులు చేపట్టారు. ఇందులో రూ.4.78 కోట్లు కూలీలకు చెల్లించగా రూ.1.80 కోట్లు శాశ్వత అభివృద్ధి పనులకు చెల్లించారు. పనుల్లో జరిగిన అవినీతిని బట్టబయలు చేయడంతోపాటు పారదర్శకతను ప్రజలకు వివరించడానికి సామాజిక తనిఖీ కార్యకర్తలు మరో వారం రోజుల్లో మండలానికి రానున్నారు. ఇందుకు కోసం పనులకు సంబంధించిన మస్టర్లు, ఎంబీ రికార్డులను అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.

నివాళి

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుడు, న్యాయవాది వడ్నాల వంశీకృష్ణ యాదవ్ ఇటీవల రోడు ప్రమాదానికి గురై శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శనివారం వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, తదితరులున్నారు.

పరామర్శ

దుగ్గొండి: మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన కొండ్ల సాంబలక్ష్మి, మారెల్లి రాధమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, ఒలిగె నర్సింగరావు, సర్పంచ్ తోట్ల నీలవేణి కుమారస్వామి, బాబు, సారంగపాణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



శాయంపేట : క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసికోల్లాసం లభిస్తుందని మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాలలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా స్థాయి రన్నింగ్, షాట్‌పుట్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న మోహన్ కృష్ణ మొదటి బహుమతి సాధించగా ప్రిన్సిపాల్ అభినందించి ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణ సామాజిక బాధ్యత

● ఎన్ఎస్ఎస్ పీఓ వీరారెడ్డి



కళాశాలలో మాట్లాడుతున్న వీరారెడ్డి



ఆశ్రమంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

నర్సంపేట: మానవ హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా ఎన్ఎస్ఎస్ పీఓ వీరారెడ్డి అభివర్ణించారు. మానవ హక్కుల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కాకతీయ గ్రాడ్యుయేట్స్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సల్ డిక్లరేషన్ ద్వారా ప్రపంచంలో మనుషులందరికీ జాతి, కుల, వర్ణం వటి తేడాలు లేకుండా సమాన హక్కులు లభించాయని చెప్పారు. హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, కృపాకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంజీవని ఆశ్రమంలో..

పట్టణంలోని సంజీవిని ఆశ్రమంలో మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ ఎ.మోహన్‌రావు మాట్లాడారు. మానవ హక్కుల గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రజలందరూ హక్కులను కాపాడుకోవాలని తెలిపారు. స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ బాలల హక్కులపైనా చైతన్యవంతం కావాలని సూచించారు. బాలలకు ప్రధానంగా జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కు ఉంటాయని వివరించారు. బాలలు హక్కులకు భంగం కలిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌కు ఫోన్ చేసి కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు వినోద మోహన్‌రావు, ఆశ్రమ ఇన్‌చార్జి సత్యకుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



నెక్కొండ: జానకిని అభినందిస్తున్న టీచర్లు

నెక్కొండ: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని సూరిపెల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మూడు జానకి ఎంపికైనట్టు హెడ్‌మాస్టర్ బత్తుల పరమేశ్వర్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జానకిని శనివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ మాట్లాడారు. గత నెలలో జరిగిన 33వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జానకి ప్రతిభ చాటినట్టు తెలిపారు. నేటి (ఈనెల 17) నుంచి 19 వరకు కర్నాటకలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో జానకి పాల్గొంటుందని చెప్పారు. జానకి జాతీయ స్థాయికి ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, ఎంపీటీసీ శారద, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వెంకటమల్లు, పీఈటీ రాంబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, జోగయ్య, రమేశ్, నర్సింగరావు, అన్నపూర్ణ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు..

హన్మకొండ: జాతీయ స్థాయి యోగా పోటీలకు వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన భాను ఎంపికైనట్టు ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. చేర్యాల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భాను ఇటీవల నల్గొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 19, 20 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో భాను పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భానును యోగా గురువులు పోశాల శ్రీనివాస్, సునీత సన్మానించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలోని కోదండ రామాలయంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వేడుకగా ప్రారంభమైంది. విగ్రహ కైంకర్య దాతలు వెంకట్‌రెడ్డి–శోభారాణి దంపతులు వేదపండితులు శ్రీధరాచార్యుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనము, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ, ఉత్సవ విగ్రహాభిషేకం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కోటగండి మైసమ్మకు మొక్కుల చెల్లింపు



నర్సంపేట రూరల్ : నర్సంపేట ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డి గెలిచిన నేపథ్యంలో మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాడ్గుల నిరంజన్‌రెడ్డి, బొబ్బాల రమణారెడ్డి, వడల శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, పులుగుల రాజిరెడ్డి గీసుగొండ మండలంలోని కోటగండి మైసమ్మ తల్లి ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుకున్న మేరకు 101 కొబ్బరికాయలు కొట్టారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



చంద్రమౌళిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపురం చంద్రమౌళి ఇటీవల బదిలీ కాగా ఆయనకు ఉపాధ్యాయులు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి చంద్రమౌళిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి మాట్లాడారు. చంద్రమౌళి ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాలకు ఎనలేని సేవలను అందించారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కతిజుల్ కుబ్రా, డీటీఎఫ్ బాధ్యులు కందగట్ల రమేష్, నాగేశ్వర్‌రావు, చింతనెక్కొండ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, పెద్దతండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వేణు, ఎంఆర్‌సీ సిబ్బంది శిల్ప, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కుక్ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగెం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) అసిస్టెంట్ కుక్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాధికారి ఎస్.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ కుక్‌గా పని చేసేందుకు మండలానికి చెంది, 7వ తరగతి పాసైన మహిళలు ఈనెల 20న సాయంత్రం 4 గంటలలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న ఇంటర్వ్యూ, డెమో నిర్వహించిఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9492201975లో సంప్రదించాలని కోరారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట: నర్సంపేట డివిజన్‌లోని పలు రూట్లలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏబీఎ స్ఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గడ్డమీది బాల కృష్ణ మాట్లాడారు. నల్లబెల్లి వయా ముచ్చింపుల, రంగాపురం ములుగు, రుద్రగూడెం వయా కొండాపురం, దుగ్గొండి మండలంలోని ముద్దునూరు వయా మైసంపల్లి, తిమ్మంపేట వయా భూపతి మల్లంపల్లి, బాంజీపేట, చంద్రమయ్యపల్లి, దాసరిపల్లి, కమ్మపల్లి రూట్లలో గతంలో బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కాగా ఐదు నెలలుగా సదరు రూట్లలో బస్సు సౌకర్యం నిలిపేయడంతో ప్రజలు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి సదరు రూట్లలో బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, శ్రీకాంత్, వంశీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

'లంబాడా ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి'

చెన్నారావుపేట: లంబాడా సామాజికవర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని సేవాలాల్ బంజార కమిటీ అధ్యక్షుడు బోడ రవీందర్ కోరారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీలది రాష్ట్రంలో అతి పెద్ద సామాజికవర్గమని చెప్పారు. లంబాడీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించి సామాజిక న్యాయం పాటించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని బంజార ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు.

ఆటోడ్రైవర్ల ర్యాలీ, రాస్తారోకో



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ ఆటో డ్రైవర్లు పట్టణంలో శనివారం భారీ నిరసనా ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. దీంతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు చేరుకుని నిరసనాకారులను సముదాయించి ఆందోళన విరమింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అనంతరం ఆటోడ్రైవర్లు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడారు. మహిళలందరికీ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటోడ్రైవర్లు వాపోయారు. కుటుంబ పోషణ భారమవుతోందని, ఆటో అద్దె కూడా చెల్లించలేకపోతున్నామని ఆందోళన వెలిబుచ్చారు. ఆటోడ్రైవర్లను ఆదుకునేలా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాలి'

ఐనవోలు: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని హెచ్ఎంలు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పురోగతి, అంశాలు, పాఠశాలలో అమలవుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై చర్చించారు. పాఠశాల హెచ్ఎంలు, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంబారట్టును విజయవంతం చేయాలి

దామెర: మండల కేంద్రంలో ఈనెల 23న నిర్వహించనున్న పంబారట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయ్యప్పస్వాములు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 23న ఉదయం 8 గంటలకు ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయ్యప్పస్వామి విగ్రహంతో శోభయాత్ర నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని గిద్దె చెరువులో స్వామివారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంబారట్టు (జలక్రీడ), పడిపూజ నిర్వహిస్తామని చెప్పారు. అయ్యప్పస్వాములు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోలం కృపాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బిల్లా రమణారెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, గరిగె కృష్ణమూర్తి, అనిల్‌రెడ్డి, వేల్పుల ప్రసాద్, మొద్దు ప్రవీణ్, దుర్శెట్టి భిక్షపతి, అయ్యప్పస్వాములు ఆలేటి సునీల్‌కుమార్, ఎక్కలదేవి శ్రావణ్, కార్తీక్, సంపత్, రవికుమార్, రమేష్, జయపాల్ పాల్గొన్నారు.

ఆలయంలో ధనుర్మాసోత్సవం



గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లిలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, అర్చకుడు జయకృష్ణ ఆచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధనుర్మాస ఉత్సవాలు నేటి నుంచి జనవరి 15 వరకు నిర్వహిస్తామన్నారు. 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక పుష్పార్చన, 24 నుంచి 26 వరకు అధ్యయన ఉత్సవాలు, 2024 జనవరి 4న కుత్తు విళ్లక్కు దిపోత్సవం, 12న కూడారై ఉత్సవం, 13న సాయంత్రం గోదా కల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధితులకు అండగా ఉంటాం



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: అటవీ జంతువులతో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన సపావట్ కేవ్లా గతేడాది నవంబర్ 11న ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో కేవ్లా సతీమణి వాలీకి ఎమ్మెల్యే శనివారం అందజేసి మాట్లాడారు. అటవీ జంతువులతో ప్రాణాలు కోల్పోయిన బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవికిరణ్, ఎఫ్ఎస్ఓ సోమ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవనజ్యోతి బీమా చెక్కు అందజేత



వర్ధన్నపేట :చెక్కు అందజేస్తున్న మేనేజర్ నరేశ్

వర్ధన్నపేట: మండలంలోని కుమ్మరిగూడెంకు చెందిన భూక్యా భారతి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షల చెక్కును యూబీఐ మేనేజర్ ఇస్లావత్ నరేశ్ అందజేసి మాట్లాడారు. భారతి బ్యాంక్‌లో బీమా కింద రూ.436 ప్రీమియం చెల్లించిన క్రమంలో బీమా మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఓ అధికారి రవివర్మ, సబ్ మేనేజర్ రమేశ్, ఏజెంట్ నాగరాజు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన



నెక్కొండ : మాట్లాడుతున్న యమునారెడ్డి



వర్ధన్నపేట: బహుమతులు ఇస్తున్న నిర్వాహకులు

నెక్కొండ: అవగాహన పెంచుకోవడం ద్వారానే ఎయిడ్స్‌ను నిర్మూలించగలమని స్థానిక సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని విద్యోదయ గురుకుల పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ముగ్గులు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ యమునారెడ్డి మాట్లాడారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపవద్దని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జునరెడ్డి, డైరెక్టర్ చల్లా పారిజాతం, ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆడెపు రామకృష్ణ, డీఏపీసీయూ ఫైనాన్స్ డిపార్టమెంట్ ఉద్యోగి కమలాకర్, ఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ శాంతరాజ్, కౌన్సిలర్ జేఎస్.రాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

వర్ధన్నపేట: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రంగవల్లులు, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆడెపు రామకృష్ణ మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్త పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శాంతరాజ్ మాట్లాడుతూ టోల్ ఫ్రీ 1097కు ఫోన్ చేసి ఉచిత సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పోషయ్య, ఐసీటీసీ కౌన్సెలర్ అశోక్, అధ్యాపకులు శ్రీనివాసరావు, డాక్టర్ సంధ్య, డాక్టర్ శ్వేత, డాక్టర్ సుధారాణి, శ్రీనివాస్, డాక్టర్ మాలతి, అవుట్ రీచ్ ఉద్యోగి ప్రవళిక, సిబ్బంది సరోజన, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ



అయ్యప్పస్వామికి పడిపూజ చేస్తున్న అర్చకులు

నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజ మహోత్సవ అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. పడిపూజ దాతగా ఉప్పరపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మానస శ్రీధర్‌రెడ్డి వ్యవహరించగా ఆలయ ప్రధాన అర్చకుడు సి.వెంకటేశ్ శర్మ గురుస్వామి 18 పడిమెట్లపై స్వామి వారికి పుష్పాభిషేకం, నైవేద్యంతో పడిపూజ నిర్వహించారు. అన్నదాతలు కరివెందుల వెంకట్‌రెడ్డి కమలాదేవి, కందికొండ కుమార్ సునీత, లింగాపురం అయ్యప్ప స్వాముల బృందం మాలదార స్వాములు, భక్తులకు అన్నదానం చేసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాధవ శంకర్ మాట్లాడారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్‌గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, శ్రీరాముల శంకరయ్య, భూపతి లక్ష్మీనారాయణ, దొడ్డ వేణుగోపాల్, దొడ్డ వేణు, మల్యాల రాజు, పాలకుర్తి శ్రీనివాస్, శింగిరికొండ రామ్‌రాజ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రాలతో మహిళలకు రక్షణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్మలాదేవి, తదితరులు

వర్ధన్నపేట: సఖి కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు రక్షణ లభిస్తుందని కౌన్సెలర్ నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో తుంగభద్ర వీఓ గ్రూపులకు శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజంలో పలువురు మహిళలు, బాలికలు అనేక రకాల హింసకు గురౌతున్నారని తెలిపారు. బాధిత మహిళలను, బాలికలను కాపాడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మహిళ రక్షణ చట్టాలు, సఖి కేంద్రంలో లభించే పలు రకాల సేవల గురించి వివరించారు. బాధిత మహిళలు, బాలికలు హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చని తెలిపారు. బాలికల నుంచి అన్ని వయస్కుల స్త్రీల వరకు సేవలు పొందవచ్చని చెప్పారు. తొలుత సఖి కేంద్రంలో లభించే సేవలు తెలిపేలా ముద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.